

# ముళ్ళు

సింహప్రసాద్

ఇది అంతర్జాతీయ బాలల సంవత్సరమని గర్వమో, లేక సంపూర్ణ వేటలో పదుతగా లేస్తూ పరుగులు తీస్తున్న పెద్దల్ని చూసి పరిహాసమో తెలియదు కానీ ఆ పాప చాలా హాయిగా, ఆనందంగా, ఆహ్లాదయుక్తంగా, తృప్తిగా నవ్వుతూంది ఆ ఇంటి గడప నానుకుని నిలబడి వీధిలోకి చూస్తూ.

గులాబీ మొగ్గని గుర్తుకు తెస్తున్న ఆ పాపకు ఇటీవలే తొలి పుట్టిన రోజు. వేడుకగా జరిగింది. ఆరోగ్యంగా, పుష్టికరంగా ఉండేమో దానికి తోడు చక్కని ఫ్రాక్ ధరించిందేమో కాటుక దిద్దిన కళ్ళను ఇంచక్కా త్రిప్పుతూ చూస్తూ నవ్వులు కురిపిస్తూంది. నుదుటి తిలకం, గాలికి అల్లల్లాడుతున్న వంకీల జుట్టు, మెడలో మెరుస్తున్న చిన్నసైజు లాకెట్టు ఆ పాప అందానికి మెరుగులు దిద్దుతున్నాయి.

పాప తల్లి వంటింట్లో పిండి వంటలు చేయడంలో నిమగ్నమై ఉంది. బామ్మ పక్కగదిలో నిద్రపోతూంది. పాప తండ్రి ఆఫీసు కెళ్ళాడు.

ఇక ఆ చిన్నారికి అడ్డేమిటి?

అందుకే గడపలో కూర్చొని ఆనందిస్తూంది. లేపడుతున్నట్టుగా గుమ్మాన్ని ఆనుకుని నిలబడి నవ్వుల ముత్యాలు రాలుస్తూ నవ్వు కళ్ళు తిప్పి చూస్తూ, మధ్య మధ్య రోడ్డున పోతున్న బాటసారుల్ని చూసి చేతులు వూపుతూ ఉత్సాహంగా ఏదేదో చెపుతూంది.

భాష అర్థంగాకపోయినా ముద్దులు మూటగడుతున్న పాపని చూసి ముచ్చట పడుతున్నారు ఆ ఇంటి ముందుగా రోడ్డంట వెళ్తున్న జనం. కొందరు ఒక్క క్షణం పాటు నిలిచి చూస్తూ తామూ చేతులూపి టాటా చెబుతున్నారు. మరి కొందరు బుజ్జిపాపను కన్న తలిదండ్రులెంత అదృష్టవంతులో అనుకుంటూ గోడకున్న నేమ్‌బోర్డుని చూస్తున్నారు. ఆ బోర్డు మీద ''కె. శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్'' అని వ్రాసి ఉంది.

జనాన్ని చూసే కొద్దీ పాప ఉత్సాహం అతిశయించింది. ఏదేదో చెప్పాలని ఉత్సాహంతో అతి కష్టం మీద కాస్త ఎత్తుగా ఉన్న గుమ్మం దాటింది.

ఎవరెస్టు ఎక్కినంత సంబరపడి గుమ్మాన్ని, జనాన్ని మార్చి మార్చి చూసి రెండు చేతులూ వూపుతూ, ఏదేదో చెబుతూ ముందుకి పాకసాగింది ఆ చిన్నారి పసిడి బొమ్మ.

* * *

మునిసిపాలిటీ ఆఫీసు ముందు అంబాసడర్ కారు వచ్చి ఆగిందో లేదో ఆఫీసు వరండాలో పచార్లు చేస్తున్న ఒక పది పన్నెండు మంది ప్రజానాయక

పక్కలు గబగబా ముఖంలోకి నవ్వు తెచ్చుకుని హడావిడిగా సమీపించి వినయంగా వంగి నమస్కరించారు.

భక్తుల్ని చూసీ చూడనట్టుగా చూసి నవ్వే దేవుళ్ళా కారు దిగి నలుగుర్నీ పలకరిస్తూ నవ్వారు ఛైర్మన్ సీతారామయ్యగారు.

"ఏమిటో అంతా వచ్చేసినట్టున్నారు. నా మీద అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడం లేదు కదా!" ఛైర్మన్‌గారు నవ్వారు.

"భలేవారే ఛైర్మన్ గారు" అంటూ ఆదేదో పెద్ద జోక్ అయినట్లు పగలబడి నవ్వేశారంతా.

"మొరార్జీభాయ్ గనుక అలా చేశారు కానీ తమమీద అవిశ్వాస తీర్మానం పెట్టగల దమ్ము లేవడికున్నాయండీ" అన్నాడో కాకారాయుడు ఆయన మెప్పుకోలు కోసం మెడలు చాచి చూస్తూ.

"తమరీ పట్టణానికి ముకుటం లేని మహారాజు కదా..." మరో పెద్ద మనిషి అన్నాడు.

"మహారాజుల కాలం పోయి చాలా ఏళ్ళయ్యిందండోయ్, సుబ్బన్నగారూ." ఛైర్మన్‌గారి మాటల్లాంటి జోకు కంతా నవ్వేశారు.

"కత్తులూ కిరీటాలూ లేకున్న రాచరికాని మిగిలిన అధికారాలన్నీ మీ ఆరచేతిలో బందీలేకదండీ..." సమర్థించాడు మరొకాయన.

ఫరవాలేదు, పైకొస్తారు అన్నట్టు ఆ మాటపుడ్ని చూసి ముందుకు నడిచారు ఛైర్మన్‌గారు.

వరండాలో నిలబడ్డ కమీషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, చిన్నా పెద్దా, గుమాస్తాలూ, ప్యూన్లూ మోకరిల్లి వారు పెట్టిన దండాల్ని స్వీకరిస్తూ పూరికే వదలిచ్చేస్తున్న వేల్పులా నవ్వుతూ "ఏమిటోయ్, ఎలా ఉంది? బావున్నావా" అంటూ పలకరిస్తూ, వారి జవాబులు విన్పించుకోకుండానే ముందుకు సాగిపోయారు.

ఒక పక్కన నిలబడి ఉన్న ఉపాధ్యాయ ప్రతినిధుల్ని చూసేసరికి ఛైర్మన్‌గారి ముఖం ఒక అర క్షణం అప్రసన్నంగా మారి మళ్ళీ మామూలు నవ్వు పులుముకుంది.

"మాస్టర్లొచ్చారేమిటి కథ ఇటికి సెల విచ్చేశారేమిటి!"

"ఇవాళ సెకండ్ సాటర్‌డే కదండీ."

"ఆహా! మీకేమయ్యా స్కూలంటే సెలవు, ఆటంటే సెలవు. ఎండొస్తే సెలవు. వానొస్తే సెలవు. ఇక మేమూ ఉన్నాం ఎందుకూ క్షణం తీరికుండదు" అంటూ అసూయ పర్యం పండ చూశారు.

"ఎంత బాగా సెలవిచ్చారు" అన్నట్టు చూస్తూ తల ఊపేశారు వాళ్ళు.

"మా జీతాల సంగతి. . ." ఒక మాస్టారు గొణిగారు.

"రెండు నెలల నుంచే కదా ఇబ్బందీ చూద్దాం రేపో ఎల్లుండో హైదరాబాద్ వెళతాను. గవర్నమెంటు నుంచి గ్రాంట్ రాడానికి గట్టిగా ప్రయత్నిస్తానండి" అనేసి మీటింగ్ హాల్లో కెళ్ళిపోయారు.

ఛైర్మన్‌గారు పెద్ద కుర్చీలో కూర్చున్నాక. కౌన్సిలర్లంతా మామూలు కుర్చీల్లో కూర్చున్నారు.

ఆయన నందర్నీ పలకరిస్తూ, పిచ్చాపాటి మాట్లాడుతూ వూరి విషయాలూ, పేటల విశేషాలూ అడుగుతూంటే 'మీ చల్లని పాలనలో ప్రజల కిబ్బందులా? రామరాజ్యం ఎంత మాట' అన్నట్టు జవాబిస్తున్నారు వారి అనుకూల వర్గానికి చెందిన కౌన్సిలర్లు.

ప్రతిపక్షంలో ఉన్న నరసయ్యగారికి వారి ధోరణి నచ్చలేదు. ఇప్పుడే కాదు, ఎలక్షన్ రిజల్ట్స్ తెలిసిన ఉత్తర క్షణా న్నుంచీ ఆయనలో అసంతృప్తి పేరుకోడం మొదలయింది. ఎలాగని గట్టిగా ఏమన్నా చేద్దామంటే ఇద్దరే ఒక్క మంది సభ్యులున్న ఆ మున్సిపాలిటీలో కేవలం నలుగురే ఆతని పక్షంలో ఉన్నారు. అందుచేత ఈ సారి ఎలక్షన్లో తనూ, తన అనుచరులూ గెలవక పోతారా, తను ఛైర్మన్ కాక పోతాడా అని ఆ రోజు కోసం వూపిరి బిగబట్టి మరీ ఎదురు చూస్తున్నా రాయన.

"మన బాతాఖానీ కట్టి పెట్టి అసలు విషయం లోకి వస్తే బావుంటుందనుకుంటాను." నరసయ్య గారి మాటల కంతా నిశ్శబ్దమై పోయారు.

"మన నరసయ్యగారేదో ముఖ్యమైన తీర్మానం ప్రవేశ పెట్టబోతున్నారు కాబోలు." ఛైర్మన్‌గా రన్నారు.

"అవునండీ, మన మున్సిపల్ స్కూల్స్ లోని టీచర్లకి రెండు నెలలుగా జీతా లివ్వడం లేదు. జీతా లిచ్చినా సరిగ్గా బతకలేని ఈ కరువు రోజుల్లో అసలు జీతాలే ఇవ్వక పోవడం చాలా దారుణం. అయినా మనకి చీమ కుట్టినట్టుగాకూడా లేదంటే ఇంత కంటే ఘోరం ఉండబోదు."ఆవేశంగా అన్నారాయన.

"ఛైర్మన్‌గారి కృషివల్ల మీరు ఎక్కువగా అంచనా వేస్తున్నారు. ఒక్క వారం రోజుల్లో హైదరాబాద్ వెళ్ళి ప్రభుత్వ గ్రాంట్ తేకపోతే అడగండి," సుబ్బన్న గారన్నారు నవాలు చేస్తున్న ధోరణిలో.

"ఈ మాట చాన్నాళ్ళ నుంచి అంటున్నారు." నరసయ్యగారి గొంతులో ఉన్నారు.


"ఈసారికూడా ఎదురు చూడండి మరి." ఛైర్మన్‌గారు నవ్వారు. గిరిగిరి వాళ్ళూ ప్రతి నవ్వారు.

తరవాత పట్టణంలోని రోడ్ల దుస్థితి గురించీ, దోమల బెడద గురించీ, వెలగని వీధి దీపాల గురించీ విమర్శలూ, ప్రతివిమర్శలూ, సమర్థనలూ వాగ్వాదాలూ సాగాయి.

"ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే, మన పట్టణంలో మురికి కాలవల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. వాటిలో కుళ్ళు నీళ్ళా, చెత్తా చెదారాలు నెలల తరబడి నిలవ ఉంటున్నాయ్. భరించరాని దుర్గంధం వల్లా, దోమల వల్లా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు జనం అధికంగా నివసించే ప్రాంతాల్లో మురికి కాలువ మైన వాపరాలు పరిపించడానికి గత సంవత్సరం కాంట్రాక్టు ఇచ్చాంకాని, కాంట్రాక్టు పూర్తి అయి ఆరు నెలలన్నా కలేదు. కాని ఒక్కచోటా ఒక్క రాయీ లేదు. మొకాలు లోతున్న ఆ కాలవల్లో పొరబాటున పిల్లలు పడ్డా, పెద్ద వాళ్ళే రాత్రి జారి పడ్డా ఎలాటి ప్రమాదాలు జరుగుతాయో ఆలోచించి, ఆ కాంట్రాక్టు వ్యవహారం గురించి దర్యాప్తు చెయ్యడానికి మన సభ్యులతో ఒక కమిటీని వెయ్యాలసిందిగా ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నాను" అన్నారు నరసయ్యగారు ఉద్రేకంగా.

అసలా కాంట్రాక్టు తనే తీసుకోడాని కాయన చాలా ప్రయత్నించారు కాని ఛైర్మన్‌గారు దాన్ని తన బామ్మరిది కివ్వడంతో లాభం లేకపోయింది. దానికి తోడు అతగాడు అక్కడక్కడా ఏదో పని చేసినట్టు చేసి మూడొంతుల సొమ్ము స్వాహా చేసి, ఒక మంచి బిల్డింగ్ కట్టుకోవడంతో మహా మంటగా ఉంది దా విషయంలో నరసయ్యగారికి.

"నరసయ్యగారు చాలా ఘోరంగా మాట్లాడుతున్నారు." "ఆ మాటలు పూర్తిగా అబద్ధం." "ఛైర్మన్‌గారా విమర్శని లెక్క చెయ్యక్కర్లేదు. అది దురుద్దేశంతో కూడుకున్న విమర్శ" అంటూ సభ్యులు తమ తమ నిరసనని తెలియజేస్తుంటే నవ్వుతూ కొంచెం సేపు వీక్షించి అన్నారు ఛైర్మన్‌గారు: "సోదర సభ్యుడికి నా మీద చాలా కోపంగా ఉన్నట్టుంది. అందుకే అలాటి అభాండం వేశారు. అయినా జవాబు చెప్పడం నా విధి. అప్పట్లో మనం చెప్పిన మేరకు కాంట్రాక్టు పూర్తి చెయ్యడం జరిగింది. మన కమీషనర్‌గారూ, శానిటరీ ఇన్‌స్పెక్టరూ, తదితరులంతా పని బాగా జరిగినట్టు రిపోర్టు రాశారు. నేనుకూడా కొన్ని చోట్ల చూశాను. మన సభ్యులుకూడా అదే మాట చెప్పారు. కాదంటే ఒకటి మాత్రం నిజం. ఈ మధ్య వర్షా లెక్కువగా కురవడంవల్ల చాలా నాపరాళ్ళు పగలటమో, కొట్టుకు



పోవటమో జరిగింది. అలాగే సైడు కాలువలు పూడుకు పోయాయ్. అందుచేత ఈ ఏడాది మళ్ళీ ఇంకో కాంట్రాక్టు ఇద్దామనుకుంటున్నాను."

"ఇది చాలా అన్యాయం." నరసయ్యగారు అరిచారు.

"కావలిస్తే మీరా ఫైలు చూడొచ్చు."

"అందులో ఉన్నవన్నీ తప్పుల తడకలే. ఈ విషయం గురించి నేను మొదటినుంచీ మొత్తుకుంటూనే ఉన్నాను. మీరు మీ మెజారిటీ బలంతో ఇష్టారాజ్యంగా పాలిస్తున్నారు. మీ వాళ్ళకి కాంట్రాక్టులిచ్చి ప్రజల సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారు."

"మీరు అతిగా మాట్లాడుతున్నారు. కాంట్రాక్టు తీసుకున్నది నా బావమరిది అయినంత మాత్రాన మీరు నా మీ దింత బురద చల్లటం సహించను. కావలిస్తే కమీషనర్‌గార్నీ, శానిటర్ ఇన్స్‌పెక్టరుగార్నీ పిలుస్తాను మీరే అడగండి" అంటూ వాళ్ళని పిలిపించారు ఛైర్మన్‌గారు.

"శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గారూ, మీ రుంటూన్న పేటలో మురికి కాల్వల పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో ఛైర్మన్‌గారు వింటారట కొంచెం—చెప్పండి. ఆర్నెల్ల క్రితం కాంట్రాక్టు ప్రకారం ఆ కాలువల చుట్టూ సిమెంట్ చేసి నాపరాళ్ళు పరిచి ఉంటే ఈనా డంత అధ్వాన్నంగా ఉండేదా చెప్పండి? శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా ప్రజల ఆరోగ్యం గురించి, పట్టణ పారిశుద్ధ్యం గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకోవలసిన మీరు వాస్తవ పరిస్థితి ఎలా ఉందో, మీ రేం చేస్తున్నారో చెప్పండి."

శ్రీనివాసరావు ఇబ్బందిగా చూశాడు ఛైర్మన్‌గారి వంక.

"చెప్పండి" అన్నా రాయన.

దాంతో వెంటనే అన్నా డతడు—"ఇదివరకు కాంట్రాక్టు ప్రకారం అన్నీ బాగానే చేసినా వర్షాల వల్లా, పశువుల వల్లా, కొంతవరకూ ప్రజల వల్లా సైడ్ కాలువల పరిస్థితి బావుండలేదు. అయినా చాలా చోట్ల నాపరాళ్ళున్నాయ్. దోమల గురించి డి. డి. టి. చల్లిస్తున్నాం. సైడ్ కాలువల్ని శుభ్రం చేయిస్తున్నాం. ఇంకా. . ."

"ఒక బాధ్యత గల ఉద్యోగిగా మీ రలా మాట్లాట్టం కంటే దారుణం ఉండబోదు. తమ పిల్లలు మురికి కాలవల్లో పడిపోకుండా ఇళ్ళ వాళ్ళు తమ తమ ఇళ్ళ ముందు స్వతంగా వేసుకున్న నాపరాళ్ళను కాంట్రాక్టర్ వేసినట్లు చెప్పటం హాస్యాస్పదం. ఛైర్మన్‌గారి నీతిమాలిన ప్రవర్తనకి నిరసనగా వాకౌట్ చేస్తున్నాం" అంటూ నరసయ్యగారూ, వారి అనుచరులూ హోల్లోంచి వెళ్ళిపోయారు.

"వాన వెలిసింది." ఎవరో అన్నారు.

"పట్టే వాన కాదు—గాలి వాన" అన్న ఛైర్మన్ గారి మాటల కంతా నవ్వేశారు గట్టిగా.

"ఏమిటోయ్, ఏం చేస్తున్నావ్." వంటింట్లో అడుగు పెడుతూ అన్నాడు శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు.

"రండి రండి. మీ అమ్మగారు కూతు రింటికెళతా నంటున్నారుగా పిల్లలు తింటారని జంతికలు వండుతున్నా. ఆ పేట లొక్కొని కూర్చోండి రుచి చూద్దురు కాని" అంటూ ఒక ప్లేట్‌లో నాలుగు



ఒంటరి

చిత్రం — రంగారావు

జంతికలు వే సిచ్చిం దతడి భార్య సుభద్ర.

"ఎలా ఉన్నాయండీ! బాగా వేగాయా?"

"ఆc—చాలా బాగున్నాయోయ్. అసలు నువ్వు చెయ్యడమూ బాగుండక పోవడమూనా."

"మీరే పొగడాలి నా వంటని."

"నిజమేనోయ్. అది సరే కాని ఇవాళ మునిసిపాలిటీ మీటింగ్‌లో నరసయ్యగారు తన కుళ్ళుబోతుతనా న్నంతా బయట పెట్టుకున్నా రనుకో."

"ఏమన్నారేంటీ."

"మురిక్కాలవల కాంట్రాక్టు ఛైర్మన్‌గారి బావ మరిది తీసుకున్నారు కదూ. దాని గుర్తించేడుపు. ఆయనంతా తినేశాడూ, ఏం చెయ్యలేదూ అని..."

"అదీ నిజమేకదండీ. ముక్కు మూసుకోకుండా రోడ్డంట నడవలేకపోతున్నాం—కదండీ, బాబూ. పందులూ, దోమలూ ఎక్కువైపోయాయి. ముందు మనింటి ముందున్న కుళ్ళు కాలువ మీద నాపరాళ్ళు పరిపించండి. మన అమ్మాయి పొరపాటున కాలుజారి పడ్డా ప్రమాదం.

"చెప్పేన్లే. ఎక్కడో నాలుగు సిమెంట్ పలకలున్నాయిట—తెచ్చి వేస్తామన్నారు నువ్వు ప్రతిపక్షం వాళ్ళు మాట్లాడితే ఎలాగోయ్. మనం ఎప్పుడూ నూసీ చూడనట్టూరుకోవడం వల్లే కదా నాలుగు కాసుల బంగారం లాకెట్ చేయించాం . . .

"సర్లెండి. ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుంటున్నా రన్న మాట. మరి జనం సంగతి?" నవ్విం దామె.

"అదిస్వార్థం కాదోయ్ ఎవరి బాగు వాళ్ళు చూసుకోవడం—అంతే. ఇంతకీ శాంతి ఏదీ?" జేబులోంచి క్రాక్‌జాక్ బిస్కెట్ల పాకెట్ తీస్తూ అన్నాడు.

"హోల్లో లేదూ?"

"కనిపించడం లేదు."

"గదిలో అత్తగారి దగ్గర పడుకుని నిద్రపోతుందేమో చూడండి కొంచెం."

"శాంతీ" అంటూ గదిలో కెళ్ళాడు కాని, పాప కనిపించలేదు. హోల్లోనూ, వీధిలోనూ, పెరట్లోనూ కంగారుగా "ఎదికి ఎక్కడా లేదు, సుభద్రా" అన్నాడు.

"లేదూ?" గాభరాగా వ్యాకుడు ముందు నుంచే లేచి వచ్చి అత్తగార్ని లేపి అడిగిం దామె.

"హోల్లో కూర్చుని బొమ్మలతో ఆడుకుంటూంది కదే. ఇలా వచ్చి నడుం వాల్చానో లేదో నిద్ర పట్టేసింది" అం దావిడ.

"హోల్లో బొమ్మలున్నాయిగాని పాప లేదు." ఏడుపు స్వరంతో అంది సుభద్ర.

"ప్రక్కింటి వాళ్ళు తీసుకెళ్ళారేమో" అని ఇరుగు పొరుగును కనుక్కున్నారు, గాని శాంతి ఎక్కడా కనిపించలేదు. ఒకళ్ళిద్దరు అరగంట క్రితం గుమ్మందగ్గర చూశామన్నారు.

తల్లి, సుభద్రా శోకాలు తియ్యసాగారు. వాళ్ళని కసురుకున్నాడు గాని తనకీ ఏడుపొచ్చేసింది. అసలే ఒంటిమీద బంగారం కూడా ఉంది. దానికాశపడి ఎవడైనా ఏ పీకో నులిమేస్తే అని ఇదైపోతూ పోలీసుస్టేషను కెళ్ళి రిపోర్టిచ్చాడు. అట్నుంచే మునిసిపల్ ఆఫీసు కెళ్ళి పాకీ వాళ్ళకీ వాళ్ళకీ చెప్పి వెదకమని నాలుగు వేపులకీ పంపేసి, తనూ సైకిలు మీద పూరంతా వెదికాడు శ్రీనివాసరావు.

సాయంత్రం దాకా వెదికినా ప్రయోజనం లేకపోయింది. గుమ్మంలో ఆడుకొంటూ ఉండగా చూశామన్న వాళ్ళుతప్ప అంతకు మించి కొంచెం కూడా ఆచూకీ చెప్పలేకపోయా రెవ్వరూ.

ఇంట్లో ఆడవాళ్ళ ఏడ్పులు ప్రతిధ్వనిస్తున్నాయి. పరిచయస్థులూ, స్నేహితులూ వచ్చి ఓదారుస్తున్నారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొరకమైన అనుమానాల్ని బయట పెడుతూ మరింత బెదరగొట్టేస్తున్నారు.

శ్రీనివాసరావుకేదో అనుమానం వచ్చి కర్ర తీసుకుని వెళ్ళి ఇంటిముందున్న సైడ్ కాలువలో గుచ్చి చూశాడు గాని, ఏం తగల్లేదు. నిట్టూర్చాడు.

ఆ రాత్రి ఆ ఇంట్లో ఎవరికీ భోజనాల్లేవు. నిద్రలేదు.

మరునాడు ఉదయమే ఒక పాకీ వాడువచ్చి అన్నాడు "సార్ ఆ పైన మొగలో కుళ్ళు కాలవలో ఎవరో పసిబిడ్డ . . ."

అతడి మాటలు పూర్తికాకుండానే "పద" అంటూ వేగంగా అడుగులేశాడు శ్రీనివాసరావు. సుభద్ర కూడా అతన్ని అనుసరించింది—చీర కొంగు నోట్లో కుక్కుకుంటి.

వారింటికి కాస్త దిగువన కుళ్ళు కాలువలో ఏదో నల్లని ఆకారం కనిపించింది. ఒకళ్ళు బయటికి తీశారు. మరొకరు బకెట్‌తో నీళ్ళు గుమ్మరించారు.

"శాంతీ!' వెర్రిగా అరిచి స్పృహ తప్పి పడిపోయింది సుభద్ర.

నల్లగా మారిన పాడ మెడలో తెల్లగా మెరుస్తున్న లాకెట్‌నే పిచ్చిగా చూడసాగాడు శ్రీనివాసరావు.

నిన్నటి వరకూ గులాబీ మొగ్గలా మెరిసి, నవ్వి, నవ్వించి, ఆనందంతో కేరింతలు కొట్టిన పాలబుగ్గల పసిపాప పెద్దల స్వార్థంలాంటి కుళ్ళు కాలువలో కుళ్ళి కృశించి కన్ను మూసి దీనాడు శాశ్వతంగా!

*